క్లుప్తంగా

మనసు కవి ఆత్రేయ



లక్ష్మీపురం: ప్రేమ కవి, మనసు కవిగా కీర్తించబడ్డ ఆత్రేయ రాసిన పాటలన్నీ అమృత గుళికలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఆత్రేయ జయంతి సందర్భంగా 'మనమూ పాడుదాం రండి!' బృంద సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ బిళ్లా అశోక్ మాట్లాడుతూ సినిమా పాటల్లో తేలికైన పదాలతో ఎంతో బరువైన భావాలను పలికించిన ఆత్రేయను సినీవేమన అనవచ్చన్నారు. గాయకుడు టి.సాయిబాబు మాట్లాడుతూ ఆత్రేయ సినిమా పాటల రచయితగా నాలు గు దశాబ్దాలపాటు తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారన్నారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆత్రేయ కలం నుంచి వెలువడిన సినీ గీతాలు సగటు ప్రేక్షకుడిని సైతం ఆనంద డోలికల్లో ఊయలూగించాయన్నారు. అనంతరం గాయకులు మల్లేశ్వరరావు, రాజశేఖర్, అయూబ్‌ఖాన్, వెంకటేశ్వరరావులు ఆత్రేయ గీతాలు ఆలపించారు.

ఓటమి భయంతోనే బీసీలపై టీడీపీ దాడులు

నెహ్రూనగర్: ఓటమి భయంతోనే బీసీ వర్గీయులపై టీడీపీ దాడులకు పాల్పడుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుళ్లూరు సూరిబాబు పేర్కొన్నారు. గురువారం పాత గుంటూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రాయచోటి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒండాడి వెంకటేశ్వర్లు ఇంట్లో ఎవరు లేని సమయంలో 20 మందికి పైగా టీడీపీ నాయకులు ఆ ఇంట్లో జొరబడి వస్తువులను నాశనం చేయడం సిగ్గుచేటు అన్నారు. బీసీలకు వెన్నుదన్నుగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలంతా అండగా ఉండటం, ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకోవడంతో ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి కనిపించికుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్వీఎన్ కాలనీలో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 19 సంవత్సరాల యువతి ఈనెల 1వ తేదీ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, అత్తపై దాడి : వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్య, అత్తపై దాడిచేసిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివారాల ప్రకారం నేతాజీనగర్ 1వలైనులో నివాసం ఉండే నాగూర్‌బాషాతో బొందిలి అనూషాకు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. చెడు వ్యసనాలకు బానిసైన బాషా తరచూ భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. గురువారం నాగూర్‌బాషా తన భార్య అనూషను కొడుతున్న సమయంలో ఆమె తల్లి నాగలక్ష్మి అడ్డు వచ్చింది. నాగూర్‌బాషా ఇటుక రాయితో నాగలక్ష్మిని కొట్టి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక ఇందిరానగర్‌లో తాగునీటి సమస్య ఏర్పడడంతో కార్పొరేషన్ అధికారులు గురువారం నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. డీఈ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొండవీటి వాగులో నీటిమట్టం తగ్గడంతో భూగర్భ జలాలు అడుగంటాయని, కృష్ణాయపాలెం సమీపంలో వున్న ఇందిరానగర్‌లో ఉన్న చేతి పంపుల నుంచి తాగునీరు రాకపోవడంతో సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఇందిరానగర్‌కు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందజేస్తున్నామని, త్వరలోనే ఆ ప్రాంతానికి కూడా పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

వాసవీమాత జన్మదిన వేడుకలు

తెనాలి రూరల్: సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో గురువారం నుంచి శనివారం వరకూ జరుగుతున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి వేడుకలలో భాగంగా మొదటి రోజు విశేష కార్యక్రమాలు జరిగాయి. బాలస్వామీజీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నుంచి అమ్మవారికి పూజలు చేశారు. వాసవీ అమ్మవారు వాసవీవి విద్యాధరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పుష్ప సహిత కుంకుమార్చన, సామూహిక వాసవీ మాత సంకీర్తనలు నిర్వహించి అమ్మవారి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో మఠం చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, కమిటీ సభ్యులు, జయలక్ష్మి మాత మండలి, శ్రీ లలితా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రేపల్లెలో వెల్లివిరిసిన ఓటరు చైతన్యం

- గత ఎన్నికల కన్నా పెరిగిన ఓటింగ్ శాతం
- కీలకంగా మారనున్న మహిళలు, వృద్ధుల ఓట్లు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలే ఓటింగ్ పెరుగుదలకు కారణమంటున్న విశ్లేషకులు
- మండలంలో అత్యధిక, పట్టణంలో అత్యల్ప ఓటింగ్ నమోదు



నగరం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు(ఫైల్)

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో రేపల్లె నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలలో 2,27,232 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుష ఓటర్లు 1,11,240 కాగా మహిళలు 1,15,979, ఇతరులు 13 మంది ఉన్నారు. వీరిలో 1,87,467 మంది ఓటు హక్కు వినియోగించుకోగా పురుషులు 92,328, మహిళలు 95,139 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. పురుషుల కంటే మహిళలు 2,811 మంది అధికంగా తమ ఓటు హక్కు వినియోగించున్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా 3,582 మంది ఉద్యోగులు, దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రేపల్లె మండలంలో అత్యధికంగా 86.52 శాతం ఓటింగ్ జరుగగా, రేపల్లె పట్టణంలో 71.29 శాతంతో అత్యల్పంగా ఓటింగ్ జరిగింది. వీరిలో పురుషుల కంటే మహిళలు, వృద్ధులు గతంలో ఎన్నడూలేని విధంగా ఓటు వేసేందుకు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పాలనా సంస్కరణలే వీరిని ఓటు వేసేందుకు ప్రేరేపించాయని పలువురు విశ్లేషకులు, స్థానికులు చర్చించుకుంటున్నారు.

2019లో పోలింగ్ వివరాలు ఇలా:
2019 సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో 83.19 శాతం పోలింగ్ నమోదయ్యింది. నియోజకవర్గంలో మొత్తం 2,22,047 మంది ఓటర్లు ఉండగా 1,83,930 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రేపల్లె మండలంలో 47,591 మంది ఓటర్లు ఉండగా 41,620 మంది ఓటు వినియోగించుకోగా 87.45 శాతం పోలింగ్ నమోదయ్యింది. పట్టణంలో 36,341 మంది ఓటర్లకు గానూ 26,112 మంది వినియోగించుకోగా 71.93 శాతం నమోదయ్యింది. నగరం మండలంలో 41,341 మంది ఓటర్లకు గానూ 35,556 మంది ఓటింగ్‌లో పాల్గొనగా 85.92 శాతం, నిజాంపట్నం మండలంలో 48,843 మందికి గానూ 39,779 ఓట్లు వేయగా 81.44 శాతం, చెరుకుపల్లి మండలంలో 47,931 మందికి గానూ 40,863 మంది ఓటింగ్ చేయటంతో 80.25 శాతంగా పోలింగ్ నమోదయ్యింది. 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటింగ్ వినియోగించుకున్నారు. దీనిని బట్టి వైఎస్సార్ సీపీకి ఓటర్లు మద్దతు తెలుపుతున్నట్లు ఓటింగ్ సరళి ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

వేమూరు మండలంలో భారీగా పోలింగ్
వేమూరు: మండల వ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వేమూరు మండలంలో 86.43 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. ఎక్కువ శాతం వృద్ధులు, మహిళలు ఓటు వేయడానికి ముందుకు వచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలో నిలబడి ఓట్లు వేశారు. మండల వ్యాప్తంగా 34,857 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 15,668 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు 15,548 మంది ఓటు వేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 30,724 మంది ఓటు వినియోగించుకున్నారు.

మండల వ్యాప్తంగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 1700 ఓట్లు మెజార్టీ లభించింది. పార్టీలు, కుల మతాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించటంతో ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

2024లో మండలాల వారీగా పోలింగ్ వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
రేపల్లె పట్టణం	12,677	13,665	0	26,342	71.29
రేపల్లె మండలం	20,988	21,140	0	42,128	86.52
నగరం	17,799	18,593	0	36,392	86.09
నిజాంపట్నం	20,655	20,424	0	41079	81.84
చెరుకుపల్లి	20,209	21,317	0	41,526	84.53


2024లో గ్రామాల వారీగా పోలింగ్ వివరాలు

గ్రామం	పోలైన ఓట్లు	మహిళా ఓట్లు	పురుషుల ఓట్లు	మొత్తం
జంపని	5.740	2,429	2,539	4,968.
బూతుమల్లి	656	259	314	573
పోతుమర్రు	1152	555	536	1091
చంపాడు	867	380	392	772
వేమూరు	6,799	2,864	2,965	5,830
వరహాపురం	1,468	632	682	1,214
కుచ్చెళ్లపాడు	1,144	505	520	1025
వెల్లబాడు	797	390	370	760
కాకర్లమూడి	897	390	411	801
చదలవాడ	1450	656	648	1314
బలిజేపల్లి	1326	680	597	1277
చావలి	5,462	2,391	2,306	4,697
పెరవలి	2,857	1,209	1,284	2,493
పెరవలి పాలెం	2,291	1025	1028	2053
పెనుమర్రు	463	205	206	411
కోడిపర్రు	719	332	362	694.

గుండెకు చేటు.. ఆరోగ్యానికి పోటు

- నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే
- అధిక రక్తపోటుతో అనేక అనర్థాలు
- చాపకింద నీరులా వ్యాపిస్తున్న వ్యాధి
- నేడు యువకులు సైతం బీపీ బారిన..
- జాగ్రత్తలతో బీపీని కంట్రోల్‌లో పెట్టవచ్చంటున్న వైద్యులు





గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల రక్తపోటు (బీపీ) వ్యాధి బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగి పోతుంది. చాలా మందికి బీపీ ఉందన్న విషయం తెలుసుకునేలోపే ఆ వ్యాధి వల్ల కలిగే అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయి. బీపీ 120/80 ఉంటే సాధారణ బీపీగా లెక్కిస్తారు. చిన్న వయస్సులోనే బీపీ బారిన పడుతున్నవారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతుండటంతో వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ (డబ్ల్యూహెచ్ఎల్) సంస్థ 2005 నుంచి ప్రతి సంవత్సరం అధిక రక్తపోటు(హైపర్ టెన్షన్)పై అవగాహన కలిగించేందుకు మే 17న వరల్డ్ హైపర్ టెన్షన్ డే నిర్వహిస్తోంది. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

సైలెంట్ కిల్లర్...
శరీరంలో రక్తాన్ని అన్ని రక్తనాళాలకు గుండె ఒత్తిడి(ప్రజర్) చేసి పంపిస్తోంది. అధిక వేగంతో రక్తాన్ని ప్రసరింప చేసే శక్తినే బ్లడ్ ప్రజర్‌గా పేర్కొంటారు. అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారని వైద్యులు తెలిపారు. చాలా మందికి రక్తపోటు లక్షణాలు ఉన్నట్లు కూడా తెలియకపోవడం వల్ల ఉన్నట్టుండి గుండెపోటు వచ్చి కుప్పకూలి పోతారు. తలనొప్పి, అలసట అనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి బీపీ చెకప్ చేయించుకోవాలి. పై రెండు లక్షణాలతో పాటు ముక్కు నుంచి రక్తం కారడం, ఊపిరి తీసుకోలేకపోవడం, చూపు సక్రమంగా కనిపించకపోవడం, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు బీపీ సోకిన వారిలో ఉంటాయి.

కారణాలు..
అధిక రక్తపోటు సాధారణంగా వయస్సు మళ్లిన వారికి వస్తుంది. జన్యుపరమైన కారణాలతో కూడా వస్తుంది. ధూమపానం, మద్యపానం, ఊబకాయం, ఏమి పనిచేయకుండా ఒకేచోట గంటల తరబడి ఉండటం, హైపోథెరాయిడ్, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో, కంటికి సరిపడా నిద్రలేకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక మూత్ర పిండాల జబ్బు ద్వారా బీపీ వస్తుంది. రోజువారి ఆహారంలో ఉప్పును ఎక్కువగా తీసుకోవడం, పచ్చళ్లు ఎక్కువగా తినడం, సాల్ట్‌తో తయారు చేసి, ప్యాక్ చేసి నిల్వ చేసిన ఆహారపదార్థాలు తినడం ద్వారా బీపీ బారినపడుతున్నారు.

బాధితులు ..
జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్టు, నెఫ్రాలజిస్టు వైద్యుల వద్దకు చికిత్స కోసం వెళ్లేవారిలో ఎక్కువ శాతం మంది అధిక రక్తపోటు బాధితులే. జిల్లాలో 50 మంది జనరల్ ఫిజీషియన్లు, 30 మంది కార్డియాలజిస్టులు, 20 మంది నెఫ్రాలజిస్టులు చికిత్స అందిస్తున్నారు. వీరి వద్దకు చికిత్సకు వెళ్లే రోగుల్లో 20 నుంచి 30 శాతం మంది అధికరక్తపోటు బాధితులే. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా ఇంటింటికి వైద్య సిబ్బంది ద్వారా పరీక్షలు చేయించి బీపీ బాధితులను గుర్తించి చికిత్స అందిస్తుంది. జిల్లాలో 1,20,738 మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నట్లు జిల్లావైద్య అధికారులు నిర్ధారించి వారికిస్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రాల్లోనే ఉచితంగా మందులు అందిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలే ముఖ్యం...



ఆధునిక జీవనశైలి వల్ల వయస్సుతో సంబంధం లేకుండా అధిక రక్తపోటు బారిన పడుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో ఐదు గ్రాములకు మించి ఉప్పు తీసుకోకూడదు. మద్యపానం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండటంతోపాటు, ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. వయస్సును బట్టి బీపీ మారుతుంటుంది కాబట్టి సొంత ఆలోచనలతో కాకుండా వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులువాడాలి.

– డాక్టర్ రేపూరి హరికృష్ణ,
సీనియర్ జనరల్ ఫిజీషియన్, గుంటూరు

బీపీతో గుండెకు చేటు...



అధిక రక్తపోటు గుండెకు చేటు. గుండె సమస్య చికిత్స కోసం వచ్చేవారిలో 30 శాతం మంది బీపీ వల్ల గుండెపోటుకు గురైన వారే. బీపీతో బ్రెయిన్ స్ట్రోక్ కూడా వచ్చే ప్రమాదం ఉంది. కంటి సంబంధిత సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. వ్యాధి బాధితులు తప్పనిసరిగా క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడుతూ జాగ్రత్తలు తీసు కోవడం ద్వారా బీపీ నియంత్రణలో పెట్టుకోవచ్చు.

– డాక్టర్ పోలవరపు అనురాగ్,
ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్టు, గుంటూరు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



పెరవలిలో అవగాహన ర్యాలీ చేపడుతున్న అధికారులు

రేపల్లె రూరల్: ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవిబాబు అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓల్డ్‌టౌన్‌లోని అర్బన్ హెల్త్ సెంటరులో గురువారం నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈడెస్ జాతికి చెందిన దోమ కుట్టటంతో సంక్రమించే డెంగీ జ్వరం ప్రమాదకరమన్నారు. వ్యాధి బారిన పడిన వారిలో తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మపు దద్దుర్లు కనిపిస్తాయని చెప్పారు. ఆరోగ్యం మెరుగుపడటానికి సాధారణంగా రెండు నుంచి ఏడు రోజులు పడుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యుడిని సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. నివాస గృహాల సమీపంలో నీటి నిల్వలు, తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. తేమ వాతావరణంలో దోమల ఉధృతి అధికంగా ఉండేందుకు అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ ఎల్లయ్య, హెల్త్‌సెంటర్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సిబ్బంది శిరీష, తిరుపతమ్మ, నరేంద్ర, రామాజీ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగీ దూరం
పెరవలి(వేమూరు): డెంగీ నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి ప్రాథమిక వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణ కోసం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ప్రజలకు ప్రతి శుక్రవారం అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల ప్రాంతాల్లో తాగి పడేసిన కొబ్బరి బొండాలు, తాటి డిప్పలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మి, సూపర్ వైజర్ పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యంతో డెంగీని నిర్మూలిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: ప్రజా భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి గురువారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో డెంగీ వ్యాధిపట్ల అవగాహన కల్పించి దానిని అరికట్టడమే ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దోమకాటు వలన డెంగీ వ్యాధి వస్తుందని, ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ దోమ తమ గుడ్లను మంచి నీటి నిల్వల్లో పెట్టి దాని సంతతిని పెంచుకుంటుందని చెప్పారు. దోమకాటు వలన ముందుగా జ్వరం వస్తుందని చెప్పారు. ప్రజలందరూ ఇంటి పరిసరాలు, లోపల నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బీబీజాన్ మాట్లాడుతూ జ్వరం, శరీరంపై దద్దుర్లు, పంటి చిగుర్లు, ముక్కు, చెవి నుంచి రక్తం కారడం, యూరిన్ ఎర్రగా రావడం వంటివి డెంగ్యూ లక్షణాలని తెలిపారు. అలాంటి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు, పూర్తి వస్త్రధారణ, దోమకాటు నుంచి రక్షణ కలిగించే వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం శివాజీచౌక్ మీదుగా పట్టణంలో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఫైలేరియా సీనియర్ అసిస్టెంట్ జి.రవికుమార్, లెప్రసీ విభాగ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, క్షయ వ్యాధి నివారణ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, ఆరోగ్య సిబ్బంది ప్రసన్న, పుష్పలత, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వర రావు, దాసరి శివనాగ మల్లేశ్వరరావు, శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

19న 'జాబిల్లి పుష్పం' ఆవిష్కరణ సభ

నగరంపాలెం: ఈనెల 19న డాక్టర్ రవూఫ్ కవితా సంపుటి 'జాబిల్లి పుష్పం' ఆవిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం. సుభాని గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయ ఆవరణలో సాయంత్రం జరిగే సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పుస్తకావిష్కరణ, ప్రముఖ కవి ప్రసాదమూర్తి పుస్తక సమీక్ష చేస్తారని, సాహితీ ప్రియులు హాజరవ్వాలని వారు కోరారు.

'చిత్ర విచిత్రాల నిలయం మయసభ'



నగరంపాలెం: మయసభ చిత్ర విచిత్రాలకు నిలయమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు గుదిమెళ్ళ శ్రీకూర్మ నాథ స్వామి అన్నారు. బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మహాభారతం – సభా పర్వంపై గురువారం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీకూర్మనాథస్వామి ప్రసంగిస్తూ మయసభ విశేషాలను వివరించారు. భారతంలో శ్రీకృష్ణుడు, పాండవులు, భీష్ముడు, ద్రౌపది, కర్ణుడు, దుర్యోధనుడు తదితర పాత్రలతోపాటు మయసభ విశేషాలను భక్తులకు వివరించారు.

చిలువూరులో కంటి వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో రాప్స్ బాండ్స్ ఆఫ్ లవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కొప్పుల అనిల్ బాబు జ్ఞాపకార్థం ఉచితకంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని, సుమారు 200 మంది కంటి సంబంధిత పరీక్షలు చేయించుకున్నారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. 160 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రైల్వే సీఎంఎస్‌కు ఘనసత్కారం



పదోన్నతి పొందిన డాక్టర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ఏసీఎంఎస్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావుకు డివిజన్ సీఎంఎస్ (చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్) గా పదోన్నతి లభించడం చాలా సంతోషదాయకమని ది రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ రాఘవబాబు అన్నారు. స్థానిక గుంటూరు రైల్వే మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్టర్ శ్రీనివాసరావుకు గురువారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా రాఘవబాబు మాట్లాడుతూ రిఫరల్ హాస్పిటల్స్‌లో పెన్షనర్స్ వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. దానిని నిరోధించాల్సిందిగా కోరారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేయాలన్నారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ల వరకు ఉన్న పెన్షనర్స్ అత్యవసర వైద్యం కోసం గుంటూరు వరకు రావాల్సివస్తుందని సత్తెనపల్లిలో ఒక రిఫరల్ హాస్పిటల్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. కొన్ని రకాల మందులను స్థానికంగా కొనుగోలు చేసి ఇవ్వాల్సిందిగా కోరారు. అనంతరం డాక్టర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ ట్రెజరర్ ఆదినారాయణరెడ్డి, దేవరాజు, సుధాకర్, మౌలాలి, రామయ్య, ఎస్.ఎన్.సింగ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్



పెదకాకాని: సార్వత్రిక ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న వాగ్వివాదాలు ఘర్షణలకు దారి తీస్తున్నాయి. అప్పటి వివాదాలను కొందరు ఎన్నికల వరకే పరిమితం చేయగా మరికొందరు గొడవలు సృష్టించడానికి సిద్ధపడుతున్నారు. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు, అనుమర్లపూడి గ్రామాల్లో ఎటువంటి వివాదాలు జరగకుండా ముందస్తుగా గురువారం పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గొడవలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే అనుమర్లపూడి గ్రామంలో ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదైంది. గతంలో అగతవరప్పాడు గ్రామంలో రెండు వర్గాల మధ్య గొడవలు జరగడంతో ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీసు అధికారులు అనుమర్లపూడి, అగతవరప్పాడు గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.